క్లుప్తంగా

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వెళంగిరాజు


ఓర్సు వెళంగిరాజు

కోదాడఅర్బన్ : పట్టణానికి చెందిన ఓర్సు వెళంగిరాజును బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఓర్సు వెళంగిరాజు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

ముస్లిం, మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : ముస్లిం మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్‌ను కల్పించాలని ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ నిజాముద్దీన్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని లింగగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలు కాంగ్రెస్ పార్టీకి పూర్తిస్థాయి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కర్ణాటక తరహాలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఆలయంలో కుంకుమ పూజ


కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

మఠంపల్లి : మండల కేంద్రంలోని శ్రీకనకదుర్గమ్మ దేవాలయంలో ఆషాడమాసాన్ని పురస్కరించుకుని ఆర్యవైశ్య మహిళలు ఆదివారం శ్రీకనకదుర్గకు, శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారికి కుంకుమ పూజలు చేసి చీరె, సారె సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు బ్రహ్మశ్రీ సోమయాజుల లక్ష్మీనృసింహశాస్త్రి, సూర్యనారాయణమూర్తి, అధిక సంఖ్యలో మహిళలు తదితరులున్నారు.

నేడు, రేపు భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

మోతె : మండల పరిధిలోని అన్నారిగూడెం గ్రామంలో గల మిషన్ భగీరథ నీటి శుద్ధిప్లాంట్‌లో మరమ్మతుల కారణంగా నేడు, రేపు (సోమవారం, మంగళవారం) తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు మిషన్ భగీరథ సబ్‌డివిజన్ సూర్యాపేట ఉపకార్యనిర్వాహక ఇంజనీర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 41గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు, పలు గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు.

టీడీపీ మండల కమిటీ ఎన్నిక


ఎన్నికైన మండల కమిటీ సభ్యులు

మునగాల : మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మండల నూతన కమిటీని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఓరుగంటి ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి బయ్యా నారాయణ, పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షుడు కొల్లు నర్సయ్య, పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి ఎర్రం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నాదెళ్ల గోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శిగా గోలి పూర్ణశంకర్‌రావు, ఉపాధ్యక్షులుగా అడిదెల సుబ్బారెడ్డి, ఎర్రం రాజశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా పత్తిపాక మల్లయ్య, చింతకుంట్ల వీరారెడ్డి, కోశాధికారిగా సోమిరెడ్డి వెంకటరెడ్డి, ప్రచార కార్యదర్శులుగా షేక్ సైదా, ఎల్లావుల వీరబాబు, గాడిపర్తి మోహన్‌రావు, గొల్లపూడి గురుస్వామిని ఎన్నుకున్నారు. తెలుగు యువత మండల అధ్యక్షుడిగా మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన ములుగూరి ప్రదీప్‌ను ఎన్నుకున్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

హుజూర్‌నగర్ : పట్టణంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుపూజ మహోత్సవం జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘ చాలక్ అప్పయ్య, ప్రధానవక్త శివకుమార్, నర్సింహారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

కోదాడరూరల్ : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ముగ్గురిపై పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. అర్వపల్లి మండలం నుంచి అనుమతులు లేకుండా లారీలో ఇసుకను తీసుకొచ్చి పట్టణంలోని గోపిరెడ్డి నగర్‌లో అన్‌లోడ్ చేస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. లారీ డ్రైవర్ నగేష్‌తో పాటు యజమాని అయిన ఆయన భార్య, ఇసుకను అన్‌లోడ్ చేస్తున్న జేసీబీ ఆపరేటర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా చెరువుమట్టి తరలింపు

- ఉదయం రైతుల పేరుతో పొలాల్లో డంపు
- రాత్రి సమయంలో టిప్పర్లతో ఇటుక బట్టీలకు రవాణా
- చోద్యం చూస్తున్న నీటిపారుదల, మైనింగ్‌శాఖల అధికారులు


యల్లాపురంలోని చెరువు మట్టిని తరలిస్తున్న ఇటుక బట్టీల వ్యాపారులు

పాలకవీడు : చెరువు మట్టిపై ఇటుక బట్టీల వ్యాపారుల కన్నుపడింది. ఇంకేముంది యథేచ్ఛగా అక్రమంగా చెరువు మట్టిని తరలిస్తున్నారు. ఇటుకల తయారీకి చెరువు నల్లమట్టి నాణ్యతగా ఉండడంతో భారీ యంత్రాలు, ట్రాక్టర్ల సాయంతో వేల ట్రిప్పుల మట్టిని ఒక చోట డంప్‌చేసి తరలించేందుకు సిద్ధం చేశారు. ఇదంతా నీటిపారుదల, మైనింగ్‌శాఖల అధికారులకు తెలిసినా మిన్నంటి ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. మట్టి మాఫీయాతో రూ.లక్షలు చేతులు మారుతున్నట్లు గ్రామస్తులే బాహాటంగా చెప్పుకుంటున్నారు. వారి నిర్లక్ష్య దోరణితో ప్రభుత్వానికి రావాల్సి ఆదాయానికి గండిపడుతుంది.

ప్రభుత్వ అనుమతులు లేకుండా..

మండలంలోని యల్లాపురం గ్రామంలో చెరువు మట్టిని అక్రమంగా ఇటుక బట్టీల వ్యాపారులు తరలిస్తున్నారు. ఎక్కడైనా మట్టిని తరలించాలంటే ఆయా గ్రామాల రైతులకు మినహా వాణిజ్య వ్యాపార అవసరాల కోసం నీటిపారుదల, మైనింగ్‌శాఖ, ఆయా గ్రామపంచాయతీ అనుమతులు తీసుకుని మట్టిని తరలించాల్సిఉంటుంది. కానీ అందుకు భిన్నంగా మట్టిని తరలిస్తున్నారు. భూసారం పెంపుకు చెరువు మట్టిని తోలుకునేందుకు రైతులకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ రైతుల పేరుతో అనుమతులు తీసుకుని తవ్వకాలు జరుపుతున్నట్లు తెలుస్తుంది. పెద్దల అండదండలతో అధికారులు సైతం బట్టీ వ్యాపారులకు కొమ్ముకాస్తున్నారు. లక్షల్లో చేతులు మారుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

భారీగా మట్టి డంపింగ్..

భారీ యంత్రాలు, ట్రాక్టర్ల సాయంతో రెండు రోజులుగా పగటి సమయాల్లో వేల ట్రిప్పులు ఓ వ్యవసాయ భూమిలో రైతుల పేరు చెప్పుకుని ఎవరికి అనుమానం రాకుండా పొలాల్లోకి తరలించి డంప్ చేస్తున్నారు. ఈ డంప్ చేసిన మట్టిని రాత్రికి రాత్రి భారీ టిప్పర్లతో దిర్శించర్లలోని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. దీంతో గ్రామపంచాయతీకి, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండికొడుతూ ఇటుక బట్టీల వ్యాపారులు లక్షలు దండుకుంటున్నారు. భారీ యంత్రాలు, టిప్పర్ల వల్ల రైతులు తాము సొంతంగా పోసుకున్న మటిరోడ్లు దెబ్బతింటుందని వాపోతున్నారు. ఇక్కడ నుంచి మట్టిని తరలిస్తే ఊరుకునేదిలేదని రైతులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకోవాలని అక్రమ వ్యాపారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాలని కోరుతున్నారు. దీనిపై నీటిపారుదలశాఖ డీఈ అమరేందర్‌రెడ్డిని వివరణ కోరగా.. ఇటీవల కొందరు రైతులు తమ పొలాలకు మట్టిని తోలుకోవాలని కోరడంతో అనుమతించామని, దీనిని ఆసరాగా చేసుకుని వాణిజ్య అవసరాలకు మట్టిని తరలిస్తే అడ్డుకుని కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

కలకోవ ఊరచెరువులో ..


కలకోవలో చెరువు మట్టిని తరలిస్తున్న ఇటుక బట్టీల వ్యాపారులు

మునగాల : మండలంలోని కలకోవ ఊరచెరువు నుంచి ఇతర ప్రాంతాలకు చెందిన ఇటుక బట్టీల వ్యాపారులు గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి సహకారంతో అక్రమంగా చెరువుమట్టిని తరలిస్తుండడంతో ఆదివారం పంచాయతీ పాలకవర్గం అడ్డుకున్నారు. గ్రామంలోని ఊరచెరువు నుంచి రెండు జేసీబీలతో పదుల సంఖ్యల ట్రాక్టర్లతో కొందరు ఇటుకబట్టీల వ్యాపారులు చెరువుమట్టిని పక్కనే ఉన్న ప్రభుత్వ బంజరు భూమిలో డంపింగ్ చేస్తున్నట్లు గుర్తించిన పాలకవర్గం సదరు జేసీబీ డ్రైవర్లను నిలదీయడంతో తమకు గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి సహకారంతో మట్టిని తరలిస్తున్నామని సమాధానాలు చెప్పడంతో పాలకవర్గానికి చెందిన కొందరు వార్డుసభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌తో పాటు ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. డంపింగ్ చేసిన చెరువుమట్టిని రాత్రి సమయంలో ఇటుకబట్టీలకు తరలిస్తున్నట్లు పాలకవర్గం గుర్తించింది. దీంతో పోలీసులు చెరువు వద్దకు వెళ్లి సదరు జేసీబీలను అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు వార్డు సభ్యులు మాట్లాడుతూ.. అక్రమంగా చెరువుమట్టిని తరలిస్తున్న ఇటుకబట్టీల వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని మేళ్లచెరువు, గరిడేపల్లి, పాలకవీడు, నేరేడుచర్ల, హుజూర్‌నగర్‌కు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.10లక్షల విలువైన స్పెషల్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఇతర రాష్ట్రాల వారు కాపీ కొడుతున్నారంటే అవి ఎంత ప్రజాధరణ పొందాయో తెలుసుకోవచ్చన్నారు. సీఎం కేసీఆర్ ఎంతో ముందుచూపుతో అమలు చేస్తున్న పథకాలు అందరికీ అందుతూ ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన మంద శ్రీనివాస్ ఇటీవల మృతి చెందారు. దీంతో ఆదివారం నిర్వహించిన శ్రీనివాస్ పెద్దకర్మలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పాల్గొని మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

కోదాడఅర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను విధానాన్ని పునరుద్ధరించాలని టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగుల సైదులు అన్నారు. ఈనెల 18న పట్టణానికి ఓపీఎస్ సాధన సంకల్పయాత్ర వస్తున్న నేపథ్యంలో యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం పట్టణంలో క్రికెట్ మ్యాచ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రథయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం సైదులు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో రానున్న సాధారణ ఎన్నికలకు ముందుగానే సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరింపజేసి లక్ష 72,000సీపీఎస్ కుటుంబాలకు మేలు జరిగే విధంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. కాగా క్రికెట్ మ్యాచ్‌లో విజేతలకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో టీఎస్ సీపీఎస్ఈయూ కోదాడ డివిజన్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు ఓరుగంటి నాగేశ్వరరావు, అంకులయ్య, కరుణాకర్, ఆంజనేయులు, షఫి, సిద్ధిక్, జబ్బార్, శ్రీనునాయక్, సురేష్, శ్రీనివాస్, జానకిరామ్, దుర్గయ్య, శ్రీకాంత్, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న శీలం శ్రీను

హుజూర్‌నగర్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను అన్నారు. ఆదివారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రి శానిటేషన్ వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా విజృంభిస్తున్న సమయంలో ప్రాణాలు పణంగా పెట్టి విధులు నిర్వహించారని, అటువంటి శానిటేషన్ వర్కర్లు చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వం వారి సేవలను దృష్టిలో ఉంచుకుని శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బత్తిని నాగయ్య, కార్యదర్శిగా శ్రీను, ఉపాధ్యక్షుడిగా నరసయ్య, సహాయ కార్యదర్శిగా మేకల శ్రీను, కోశాధికారిగా సుమన్, కమిటీ సభ్యులుగా కోటి, నాగరాజు, రాములమ్మ, పద్మ, ఖైరున్ బేగం, గోవిందమ్మ, సునీత, రమణ, పద్మ, రామ గోదావరి, శ్రీలక్ష్మి, ఉష పాల్గొన్నారు.

వనితా క్లబ్ ఆధ్వర్యంలో 'డాన్ టూ డస్క్'


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

గరిడేపల్లి : మండల కేంద్రంలో వనితా క్లబ్ గరిడేపల్లి ఆధ్వర్యంలో ఆదివారం డాన్ టూ డస్క్ (ఉదయం నుంచి సాయంత్రం వరకు సేవ) కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందుగా వాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆషాడమాసం సందర్భంగా వనితా క్లబ్ మహిళలు గోరింటాకు సంబరాలను నిర్వహించారు. అదే విధంగా 10మంది పేద మహిళలకు చీరలు, రైతులకు యూరియా బస్తాలు, సైనికులను శాలువాలతో సన్మానించి, పేద కుటుంబానికి నెలకు సరిపడా బియ్యం, పలువురు దాతల సహకారంతో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. అనంతరం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి సూచనలు, సలహాల మేరకు ఆరు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బంగారు పథకం కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. కార్యక్రమంలో గరిడేపల్లి వనితా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరంగం కవితరత్నాకర్, కందిబండ రమాదేవికృష్ణమూర్తి, కోశాధికారి పోలిశెట్టి రాధికశ్రీనివాస్‌రావు, ఉమ్మడి నల్లగొండ జిల్లా గవర్నర్ వంగవీటి గురుమూర్తి, సత్యనారాయణ, గుండా రమేష్, ప్రసాద్, సతీష్, హైమావతి, సర్పంచ్ సీతారాంరెడ్డి, ఎంపీటీసీ కడియం స్వప్న వెంకట్‌రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చాలి


పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ధనవిజయలక్ష్మి

నడిగూడెం : విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చాలని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్. ధనవిజయలక్ష్మి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె స్వచ్ఛందంగా రూ.7వేల విలువైన జేఈఈ పుస్తకాలను గ్రంథాలయానికి బహూకరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. పాఠశాలలోని గ్రంథాలయంలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాలు పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి నాగరాజు, వైస్‌ప్రిన్సిపాల్ వసంత, రేణుక, వెంకటేశ్వర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

25న 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

కోదాడఅర్బన్ : ఈనెల 25న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ కన్వీనర్ ధూళిపాళ్ల ధనుంజయనాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని పెరిక సంఘం భవన్‌లో నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా బీసీలు వివక్షతకు గురుతున్నారని, బీసీలు ఎన్ని రూపాల్లో ఉద్యమించినప్పటికి పాలకుల్లో చలనం లేకుండా పోయిందని, అందుకు ప్రధాన కారణం బీసీల మధ్య ఐక్యత లేకపోవడమేనన్నారు. రైతు బంధు, దళిత బంధు మాదిరిగా బీసీ బంధును రూపొందించి అమలు చేయాలన్నారు. ఇకనైనా బీసీలు చైతన్యం కలిగి రాజ్యాధికారం చేజిక్కించుకునేందుకు ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఇనుగుర్తి వెంకటరమణాచారి, నాయకులు బచ్చు రాజ్యం, నిగిదాల వీరయ్య, నాగమణి, గోవిందరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల

మఠంపల్లి : మండలంలోని యాతవాకిల్ల వద్ద గల వేములూరు ప్రాజెక్టు ఎడమకాలువకు ఆదివారం స్థానిక సర్పంచ్ కోలాహలం లక్ష్మీనరసింహరాజు, ఐబీ అధికారులు రైతులతో కలిసి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వానాకాలం వరిసాగుకు రైతులు ప్రాజెక్టు కింద వేసిన వరినారు మళ్లు నీరులేక ఎండిపోతుండడంతో ఐబీ అధికారులకు విన్నవించడంతో వారి ఆదేశాలతో సాగునీటిని విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు ఎల్లావుల నాగయ్యయాదవ్, జాల సైదులుయాదవ్, మొగిలి వెంకటేశ్వర్లు, మచ్చ వెంకటేశ్వర్లు, లింగరాజు, బాల నాగయ్య, పెదసైదులు, ఐబీ అధికారులు నాగేశ్వరరావు, కోటా తదితరులున్నారు.

గవర్నర్ దత్తాత్రేయకు వినతి

హుజూర్‌నగర్‌రూరల్ : మహిళలకు శానిటరీ నాప్కిన్స్ ఉచితంగా అందించాలని విన్నపం ఒక పోరాటం అధ్యక్షురాలు చీకూరి లీలావతి కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో పాల్గొన్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయకు వినతిపత్రం అందజేసి అనంతరం ఆమె మాట్లాడారు. మహిళలకు కెమికల్ లేని శానిటరీ నాప్కిన్స్‌ను ఉచితంగా అందించే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని గవర్నర్‌ను కోరినట్లు ఆమె తెలిపారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె


హుజూర్‌నగర్‌రూరల్ : అమరవరంలో భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు


కోదాడరూరల్ : ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్మికులు


చిలుకూరు : వంటావార్పు చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ కోరారు. ఆదివారం మండల పరిధిలోని అమరవరంలో సమ్మెలో భాగంగా భిక్షాటన చేస్తున్న కార్మికులకు పార్టీ తరుపున మద్దతు తెలిపి ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం మల్టీపర్పస్ విధానం తెచ్చి కార్మికుల మెడపై కత్తి పెట్టారని, కార్మికుల ప్రాణాలు తీస్తున్న జీఓ 51ని వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని, ప్రతి కార్మికుడికి ప్రమాద బీమా కల్పించి రెగ్యులరైజ్ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల జీపీ కార్మికుల సంఘం అధ్యక్షుడు కొప్పుల వీరారెడ్డి, షేక్ హుసేన్‌మియా, సిబ్బంది సైదులు, రామిరెడ్డి, పున్నయ్య, శ్రీను, సైదులు పాల్గొన్నారు.

శ్రమ దోపిడీకి గురిచేస్తున్న ప్రభుత్వం..

జీపీ కార్మికులను శ్రమదోపిడీకి బీఆర్ఎస్ ప్రభుత్వం గురి చేస్తుందని టీడీపీ నల్లగొండ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మండల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఆ పార్టీ ఆధ్వర్యంలో మద్దతు తెలిపి ఆయన మాట్లాడారు. మద్దతు తెలిపిన వారిలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి, కొమ్మగాని వెంకటేశ్వర్లు, కనకరత్నం, అంజయ్య ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

కోదాడరూరల్ : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఆదివారం కోదాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్మికులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ నాయకుడు రాధాకృష్ణ, కార్మిక నాయకులు లింగయ్య, ముత్తయ్య, కరీం, కొండలు, రామారావు, నరేష్, చందు, శ్రీను, బాబు ఉన్నారు.

నడిగూడెం : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. ఈ సమ్మెకు సీఐటీయూ మండల కన్వీనర్ మల్లెల వెంకన్న ఆదివారం మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో చిమట నాగరాజు, వెంకట్రామయ్య, కమలాకర్, పాష, వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

మేళ్లచెరువు : తమ సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికుల చేస్తున్న సమ్మె ఆదివారం నాల్గొవ రోజు కొనసాగింది. కార్యక్రమంలో మల్లిఖార్జున్, వెంకటేశ్వర్లు, భగవాన్, కోటయ్య, మరియమ్మ, శ్రీనివాసరావు, జ్యోతిరాణి, బాలాజీ, సైదానాయక్, నాగరాజు పాల్గొన్నారు.

చిలుకూరులో జీపీ కార్మికుల వంటావార్పు

చిలుకూరు : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు ఆదివారం వినూత్నంగా వారు వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సమ్మెకు సీఐటీయూ నాయకులు సోంపంగు రాధాకృష్ణతో పాటు పలువురు నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కట్టికోల శ్రీనివాస్‌రావు, జీపీ కార్మికులు తిరగమళ్ల వెంకటేశ్వర్లు, బండి ఉపేందర్, వడ్రాణపు తిరపయ్య, పట్టపాక నాగేశ్వరరావు, బత్తిని నాగేంద్రబాబు, కట్టికోల శ్రీను, కిరణ్, కృష్ణయ్య, కాశయ్య, రమేష్ పాల్గొన్నారు.

మఠంపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ సిబ్బంది చేపట్టిన సమ్మె ఆదివారం నాల్గొవ రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా సమ్మెకు పలువురు నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో మండల సీఐటీయూ కన్వీనర్ సయ్యద్‌రన్‌మియా, యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇంటి రవి, మైసయ్య, దేవదానం, గురువారెడ్డి, గంజి శ్రీను, దాసు, అంజయ్య, నాగయ్య, వెంకటేశ్వర్లు, కిట్టయ్య, శ్రీను, దావీదు తదితరులున్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

హుజూర్‌నగర్ : కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నానని బీఆర్‌టీయూ నియోజకవర్గ నాయకుడు పి.ఉపేందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బీఆర్‌టీయూ కార్యాలయంలో సంఘం నాయకులతో కలిసి సమావేశం నిర్వహించి కార్మికుల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

మోతె : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి కోట గోపి, సీఐటీయూ మండల కన్వీనర్ కాంపాటి శ్రీను అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా వంటావార్పు నిర్వహించారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు రవిచంద్ర, పరుశరాములు, అక్కులు, సైదులు, గుర్వయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నేరేడుచర్ల : దిర్శించర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


గరిడేపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల జెడ్పీ పాఠశాలలో 1989-90లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా నాటి విద్యార్థులు ఆనాటి మధుర స్మృతులను నేమరవేసుకోవడంతో పాటు ఒకరికొక్కరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాటి గురువులు గుంటి జానకిరామయ్య, చింతోజు సుబ్రహ్మణ్యం, వల్లాల అచ్చయ్య, పరందాం, తండు యాదయ్య, మాతంగి సోములు, అంబటి శ్రీనివాస్‌లను ఘనంగా శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు తురక వెంకటేశ్వర్లు, అరవిందాచారి, ఉడుత వెంకట్, వెంకటరత్నం, భాస్కర్, రాము, వెంకట్‌రెడ్డి, శ్రీను, రామకృష్ణారెడ్డి, గురువయ్య, రంగమ్మ, వసంత, భాగ్యలక్ష్మి, శోభ, నాగలక్ష్మి, నారాయణమ్మ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 1990-91లో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి స్మృతులు, జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆనాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంమ్మూర్తి, చంద్రారెడ్డితో పాటు ప్రస్తుత పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్ గౌడ్, పూర్వ విద్యార్థులు తదితరులున్నారు.

స్థలం కేటాయించాలి


స్థలాన్ని పరిశీలిస్తున్న బీఎస్పీ నాయకులు

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల గ్రామంలో క్రైస్తవుల శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం గ్రామంలో స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. 200మంది బీసీ కులాల వారు క్రైస్తవ మతంలోకి వెళ్లారని వారు చనిపోతే స్థలం లేక ఎన్ఎస్‌పి కాలువ పక్కన సమాధి చేస్తున్నట్లు తెలిపారు. దిర్శించర్ల రెవెన్యూ పరిధిలోని 352 సర్వేనంబర్‌లో అసైన్డ్ భూమి ఉందని, దీన్ని వెంటనే ఎమ్మెల్యే, తహసీల్దార్ పరిశీలించి ఎకరం భూమిని కేటాయించాలని కోరారు. భూమిని పరిశీలించిన వారిలో బీఎస్పీ నాయకులు రామస్వామి, నన్నెపంగ హరీష్‌రావు, శ్రీకాంత్, చర్చి పాస్టర్ మాగంటి సురేష్, యల్లమ్మ, శ్రీనివాస్, సోమయ్య, చలపతి, సైదులు, వెంకన్న ఉన్నారు.

బోరు మోటార్ చోరీ

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని శ్రీనివాసపురం గ్రామసమీపంలోని లింగగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార గోదాం నిర్మాణం వద్ద ఉన్న బోరు మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం చోరీ చేశారు. గత నెల 14న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి గోదాం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీంతో నిర్మాణ పనులు చేస్తుండగా అక్కడ నీటికోసం బోరు వేశారు. ఆ బోరులో అర్ధరాత్రి బోరు మోటార్‌ను బయటకు తీసి మోటార్‌తో పాటు కేబుల్ వైరు, స్టార్టర్‌ను దొంగిలించినట్లు పీఏసీఎస్ చైర్మన్ కట్టా గోపాలరావు తెలిపారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రైవేట్ వ్యక్తులతో పారిశుద్ధ్య పనులు


పారిశుద్ధ్య పనులు చేపడుతున్న పాలకవర్గం

మునగాల : తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు నాలుగు రోజులగా సమ్మె చేస్తుడడంతో మునగాల మేజర్ గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో పాలకవర్గం ఆదివారం ప్రైవేట్ వ్యక్తులను నియమించి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ చింతకాయల ఉపేందర్ మాట్లాడుతూ.. నాలుగురోజులుగా గ్రామపంచాయతీ సిబ్బంది సమ్మెలో పాల్గొనడంతో గ్రామంలో పారిశుద్ధ్య పేరుకుపోయిందని, దీంతో పనుల కోసం పది మంది ప్రైవేట్ వ్యక్తులను నియమించినట్లు తెలిపారు.